# జంక్షనులో బడ్డీ

"ఎందుకు నాకీ ఆపద తెచ్చి పెట్టావు ఎల్లమ్మతల్లీ? ఏనాడు నీ మొక్కు చెల్లించలేదు ఎల్లమ్మతల్లీ!" అని గోలు గోలు మని రామయ్య గుడిసెలో పెళ్ళాం పిల్లలమధ్య ఏడుస్తూ ఎల్లమ్మని ప్రశ్నించాడు.

ఎల్లమ్మ వాళ్ళ ఇలవేలుపు. ఎల్లమ్మ సిరులకి (సిరులు-జాతర) ఏటా కొత్తకోక, కోడిపిల్లా మొక్కు చెల్లిస్తారు. ఇంటపుట్టిన తొలి ఆడ పిల్లకి ఎల్లమ్మపేరు తరతరాలై పెట్టుకొన్తున్నారు. రామయ్య మేనత్త ఎల్లమ్మ. వాడి తండ్రి మేనత్త ఎల్లమ్మ. పెళ్ళయి కాపరాని కెళ్ళిన వాడి పెద్దకూతురు ఎల్లమ్మ. అందర్నీ తరతరాలై ఎల్లమ్మ కాపాడుతున్నది. అందుకే ఎల్లమ్మ తల్లికి దయతప్పి ఎందుకు ఉత్పాతం తెచ్చిపెట్టిందీ అని రామయ్య ఎల్లమ్మనే గోలపెట్టి అడుగుతున్నాడు. పూర్వం వాళ్ళ యింటి ముసలమ్మకి ఎల్లమ్మ పూని మంచి చెడ్డలు చెప్పడం ఉండేది. ఇప్పుడు ఎల్లమ్మ యింట్లో ఎవరి వంటిమీదా వాలి పూనడంలేదు.

"ఏమిటి సాధనం ఎల్లమ్మతల్లీ!" అని పొలికేక పెట్టేడు. ఆ కేక విని పక్కింటి పోలిగాడు గుడిసెలోకి దూరేడు.

"ఏటైందిరా రామయ్యా?" అని అడిగాడు.

"ఈది గోల మమ్మల్ని కొట్టేసింది పోలిగా" అని ఏడ్చింది రామయ్య పెళ్ళాం సీతమ్మ.

"ఎవరిగోల ఏంచేస్తుంది, ఎల్లమ్మ చూస్తే. తల్లికెందుకో దయ తప్పింది" అన్నాడు రామయ్య.

"ఎల్లమ్మా, పోలేరమ్మా కాదురా నీకేటొచ్చిందని ఏడుస్తున్నావు? ముందది సెప్పరా" అన్నాడు పోలిగాడు.

"దిక్కుమాలిన మునిసిపాలిటీవోరు బడ్డీ తీసెయ్యమన్నారు!" అని ఏడ్చింది సీతమ్మ. వాళ్ళ బతుకే బడ్డీ!

వాళ్ళ గూడెంలోకి పోయే జంతి ఒక ఇరుకు గొంది. అందులో ఎద్దుబండి పోలేదు. ఈ మధ్య రిక్షాలు వస్తున్నాయి. ఆ గొంది పాతిక గజాలు సాగి రోడును కలిసి మూడు రోడ్ల జంక్షను అయింది. ఆ జంక్షను దగ్గర మురికాల్వ మలుపు తిరుగుతుంది. ఆ మలుపుమీద రామయ్య బడ్డీ ముప్ఫయ్యేళ్ళయి ఉన్నాది.

"ఇది రామునాయుడి దెబ్బ ?" అని వెంటనే అన్నాడు పోలిగాడు.

రామునాయుడు వాళ్ళ వార్డు కౌన్సిలరు. అందర్నీ అమ్మా బాబూ అంటూ కాళ్లావేళ్ళా బతిమాలి గెడ్డాలు పట్టుకొని కులపోళ్ళ నందర్నీ కూడగట్టి కులం బలంతో కౌన్సిలరయి కూచున్నాడు. వాడిమీద పోటీచేసిన వాడు వేలు ఖర్చు పెట్టినా, గూడెంలో బెంకజెల్ల కొట్టేశారు నిన్నమొన్నటి దాకా రామునాయుడు గోచీపెట్టుకుని ఎడ్లని తోలుకెళ్ళినవాడు. బండి రాముడు కావలసినవాడు చిలక్కట్టుకట్టి, జలతారు కండువా పైమీద వేసుకుని కౌన్సిలేరయి కూచున్నాడు !

"అమ్మ ఎంతమాటన్నావురా ! రామునాయుడు సిన్నప్పణ్ణుంచి దద్దదద్దంటూ నన్నాగ్గడురా ! ఆడు నాజోలి కొచ్చినాడంటే నాను నమ్మను !" అన్నాడు రామయ్య.

"ఆడి దెబ్బేనని నా నమ్మకం ! ఇప్పుడు కాసినా ఆడే కాయాల. ఆడికాడికే ఎళ్ళు. ఆ కాయితం సూపెట్టు" అన్నాడు పోలిగాడు.

వెళ్ళాడు రామయ్య రామునాయుడింటికి. నాయుడు యింటిరూపే మారిపోయింది. వీధరుగుమీద ఇనప మడతకుర్చీలున్నాయి. ఇనప ఈజీ ఛైరులో కూర్చుని ఉన్నాడు రామునాయుడు. తెల్లారేసరికి చుట్టూ జనం నిండిపోయారు. రామయ్యని చూడగానే రామునాయుడు కుర్చీలోంచి లేచిపోయి—

"దద్దద్దా ? ఏమిలాగొచ్చావు ?" అని అల్లంతదూరం నుంచే తియ్యగా నోరారా పలకరించాడు. రామయ్య ప్రాణం అమ్మయ్య అని కుదుట పడ్డాది.

"కౌన్సిలేరువికదా నాకేటొచ్చిందో తెలియదా ? సూడికాయితం!" అని నోటీసు అందిచ్చాడు. చూసి ఆశ్చర్యపడిపోయాడు రామునాయుడు.

"ఎంతపనైపోయింది ? ఊళ్ళో చాలా బడ్డీలకి గాలొచ్చింది. అందులో నీది ఉందనుకోలేదు ! కనుక్కుంటాను. ఇప్పుడే వెళతాను. నోటీసు నా దగ్గరే ఉణ్ణీ. దద్దా నువ్వింటికెళ్ళు. అంతా నేను చూసుకుంటాను" అన్నాడు కౌన్సిలేరు రామునాయుడు.

"అమ్మయ్యా ! రామునాయుడూ బడ్డీ మా బతుకు సుమా ! ఈ ఆపద గట్టెక్కితే ఎల్లమ్మకి గొఱ్ఱెపిల్లని ఏటేసి తెచ్చి నీకిచ్చుకుంటాను. ఎల్లమ్మే నీకాడికి తీసుకొచ్చింది. ఇంక నీదే భారం" అన్నాడు రామయ్య.

"దద్దా నువ్వెళ్ళు. మద్దేన్నం నీయింటికొచ్చి ఏ కబురూ చెపతాను. నానంతా చూస్తాను ఎళ్ళు" అని సాగనంపాడు. అమ్మయ్య ఇంక ఫరవా లేదు-అని చల్లబడ్డాడు రామయ్య. కొండంత ధీమాతో నాకేమని రామయ్య ఉన్నాడు.

మధ్యాహ్నం రామునాయుడు అన్ని వివరాలూ కనుక్కొని రామయ్య ఇంటికేవెళ్ళి చెప్పాడు. ఏమిటి చెప్పేడు ?

"దద్దా పెద్ద చిక్కే వచ్చింది ! నీవొక్కడికే రాలేదు - వూళ్ళో ముప్పై నలభై బడ్డీల వాళ్ళ కొచ్చింది. ట్రాఫిక్కు పెరిగిపోయింది. జంక్షన్లలో బడ్డీలన్నీ పీకీమన్నారు అసాధ్యంగా వొచ్చింది. అలాగా అని తటపటాయిస్తున్నాను" అని గుడిసెలోకి దూరి నిండు అభిమానంతో చెప్పాడు రామునాయుడు. పక్కనుంచే వింటున్న పోలిగాడు లోపలికి దూరేడు.

"అసాధ్యం వొచ్చింది గనకనే నువ్వు సాధ్యంచేయాలి" అన్నాడు పోలిగాడు.

"చేస్తానురా. అదే తటపటాయిస్తున్నాను. కమీషనరు ఏకనును తీసేసుకున్నాడు. అక్కడే చిక్కుగావుంది. ఏదో అస్త్రం వేస్తానులే" అన్నాడు రామునాయుడు.

"రామునాయుడూ ! నువ్వాడుతున్న మాటలు నాకేటీ తెలవడం లేదు. సల్లటిమాట సెపతావని పిల్లాది సూస్తున్నాము. పిల్లలూ మావూ యిప్పుడే గంగలో పడ్డం? బడ్డీ మా బతుకు. నువ్వెరగం దుందా ?" అని ఏడ్చింది సీతమ్మ.

రామయ్య గోడకి జేరబడి పక్కకి వాలిపోయాడు. నోటంట మాట రాలేదు.

"ఎంతమాటన్నావు సీతమ్మా! బడ్డీ వొగ్గేస్తామా? బతుకులో బుగ్గేస్తే వూరుకుంటామా? అందుకే తటపటాయిస్తున్నాను" అన్నాడు రామునాయుడు.

చటామని రామయ్య లేచాడు.

"ఇదిగో నీ బడ్డీ ఇక్కడ బతుకు అని అర్డరు తేకపోయినావా నుయ్యో గొయ్యో సూసుకుంటాను" అన్నాడు.

"ఎందుకురా అటువంటి మాటలు. ఈ కాయితంమీద సంతకం చెయ్యి" అని కాయితంతీసి దానిమీద తాను రాయించింది తానే చదివాడు. రామునాయుడు చాలా బాగా రాయించాడు. చాలా బాగా చదివాడు అంతవాడౌతాడని చిన్నప్పుడు ఒక్కరనుకోలేదు. గూడెం మొత్తానికి మొనగాడనిపించుకున్నాడు.

మహారాజశ్రీ కమీషనరుగారి దివ్యసన్నిధికి రామయ్య రాసుకున్న పిటీషను విన్నపాలు. బడ్డీ చరిత్ర అందులో పూర్తిగా ఉంది.

రామయ్యకి పదేళ్ళు పట్టున లేనప్పుడు తండ్రి చచ్చిపోతే రామయ్య తల్లి పిల్లల్ని పెంచడానికి వేరేమార్గంలేక గొంది చివర జంక్షన్‌లో కాలవ మలుపుమీద అడ్డంగా రెండు చక్కలు వేసి తొలిసారిగా దుకాణం పెట్టింది. నీడకి పెద్ద తాటేకుల గొడుగు నిలబెట్టింది. దానికింద కూచుని కొబ్బరుండలు, చక్కిలాలు, జంతికలు, బూరెలు, పుణుకులు జంగిళ్ళలో పెట్టి అమ్మేది. బఠాణీలు, కొమ్ము శనగలు, మురీలు బుట్టలతో పెట్టి గిద్దలతో సోలలతో అమ్మేది. ఉడకెట్టిన దుంపలు, కర్రపెండలం ముక్కలు, తేగలు, మొక్కజొన్న పొత్తులు అమ్మేది. వేరుశనక్కాయలు గుడ్డలమీద పోగులుపెట్టి అమ్మేది.

ఆ దుకాణంతోటే రామయ్యని పెంచి పెద్దవాణ్ణి చేసింది. దాంతోటే ఆడకూతురికి పెళ్ళి చేసింది. దానికి పురుళ్ళు పోసింది! రామయ్యతల్లి చచ్చి స్వర్గాన్ని ఉంది.

ఆ రోజులు వెళ్లాయి. ఆ మనుషులు వెళ్ళిపోయారు. అప్పుడు వాళ్ళ వార్డుకి భుజంగరావుగారు కౌన్సిలరుగా ఉండేవారు. ఆయన గుట్టుపు

బగ్గీమీద వచ్చేవారు. వార్డువాళ్ళు ఏ యిబ్బంది చెప్పుకున్నా పట్టించుకునే వారు. రామమందిరం చుట్టూవున్న మునిసిపల్ స్థలం ఆ ప్రభువే యిప్పించాడు. ఇప్పుడు మందిరం చుట్టూ కొబ్బరిమొక్కలు, పువ్వుల మొక్కలు వేశారు. గూడేనికి గొప్ప రాంమందిరమే-ఊర్లో ఇంకే రాంమందిరానికి ఆ అందం లేదు.

అంతేనా ? రాంమందిరం అంత విశాలంగా కట్టించిందెవరు ? సింహాల తోరణం, ద్వారం కట్టించిందెవరు? మందిరం వెనక తాలింఖానా పెట్టించిందెవరు? హంసలు చెక్కినసెమ్మె - మందిరంమధ్యది - ఇచ్చిందెవరు ఆ ప్రభువే !

ఆ ప్రభువే జంక్షనులో బల్లలమీద దుకాణం పెట్టుకుని రామయ్య తల్లిని బతకమన్నాడు. దుకాణం పెట్టుకోడానికి కాయితం పుట్టించాడు. సంతకం రాని తల్లి చేత వేలుముద్ర వేయించి కాయితాలు యిప్పించాడు. ఏటా అప్పణ్ణుంచి బడ్డీకి పన్ను కడుతున్నారు.

రామయ్య పెద్దవాడై గొడుగుతీసి బడ్డీ వేశాడు. కిళ్ళీ కొట్టుగా మార్చాడు. తల్లి అమ్మినవన్నీ అమ్ముతూ చుట్టా, బీడీ, సిగరెట్టు, సోడా వగైరాలు పెంచాడు. గూడెంలో ఎవరికేం కావలసినా రామయ్య కొట్లో కొనుక్కోవలసిందే. అమాయకుడు. ఎల్లమ్మని నమ్ముకుని బతుకుతున్నాడు. చుట్టలు చుట్టుకుంటూ బడ్డీలో కూర్చొని బతికేడు. బతికేస్తున్నాడు.

శనివారం రాత్రి రాంమందిరంలో భజన చేసేటప్పుడు రామయ్య కంఠమే మీదికిలేచి ఎంత దూరానికైనా వినబడుతుంది. రామయ్య దైవభక్తి అబద్ధపు భక్తికాదు. అమాయకంగా బడ్డీమీద బతకడమే కాక బాగా డబ్బు చేశాడు. ఎంత చేశాడో ఎవరికి తెలియదు కాని చేసేడని సీతమ్మ మెడలో బంగారమే చెపుతూ ఉంటుంది. అందికే గూడెంలో కన్నెర్రగా ఉంది.

రామయ్య బడ్డీకి గాలి వచ్చిందంటే గూడెంలో అంతే కావాలి అనుకుంటున్న వాళ్లూ ఉన్నారు. గూడెమంతా గుప్పుమంది. పైకంతా అన్యాయం దానికేదో ఉపాయం చూడాలనే అంటున్నారు!

రామునాయుడు పిటీషను పకడ్బందీగానే ఉంది. ముప్పైఏళ్ళాయి పన్నులు కట్టుకుంటూ ఉన్న బడ్డీ తీసెయ్యమనడం న్యాయం కాదని దాని

సారాంశం. రామయ్య సంతకం చేశాడు. ఎల్లమ్మమీద భారం ఉంచేడు.

ఇంతకీ ఏమైంది? ససేమిరా పనికిరాదు తీసెయ్యాలన్నారు! ట్రాఫిక్కుకి అడ్డంగా ఉంది. అసలా గొందిని వెడల్పు చెయ్యవలసి ఉంది. గుడిసెలు అడ్డం లేకపోతే రోడ్డు వెడల్పు అయిపోయేది! మునిసిపాలిటీకి డబ్బులేదుగాని గుడిసెలు పీకేసి రోడ్లు విశాలం చెయ్యవలసిన పథకాలు ఉంతడం ఉన్నాయి. ఇళ్ళనే పీకెయ్యవలసి వుండే బడ్డీల నుంచుతారా ?

ఒక్క పోలిగాడే కాదు. గూడెంలో ఆడా మొగా రామునాయుణ్ణి నిలదీసి అడిగేశారు. "ఏమిటీ ఘోరం?"

"రోజులలాగున్నాయి!" అన్నాడు రామునాయుడు.

"కుడీ ఎడమా లేదా ? ఉపాయం చూడాలి" అన్నారు గూడెంవారు.

"ఇప్పుడు మనుషులతో మాటాడగలమా? వాళ్ళ దాహాలు ఎలాగున్నాయి? ఏనుగు తొండాలు జాపుతున్నారు" అన్నాడు రామునాయుడు.

అక్కడికి వచ్చింది. ఎల్లమ్మకి గొఱ్ఱెపిల్లని బలివేస్తానన్నాడు రామయ్య. మనుషులు బలికోరే వారు ఉన్నారు. ఎల్లమ్మకి బలివెయ్యకపోయినా ఊరుకుంటుంది. మనుషులకి బలివెయ్యకపోతే ముప్పు వొచ్చిపడుతుంది !

"పారేశాం నాయనా? పారేశైనా బడ్డీ మాకు నిలబెట్టు" అన్నాది సీతమ్మ.

"అలాగ్గాచెయ్యి" అన్నాడు పోలిగాడు. రామయ్య నోటంట మాట రాలేదు.

"ఆ మాట మీ నోటితోటంటే బాగుంటుంది- నా నోటితోటంటే నేనేదో తినేసినట్టుంటుంది" అన్నాడు రామునాయుడు.

"దద్దదద్దంటావు. దద్దనేం చేస్తావో చెయ్యి. ఎవడి కియ్యాలో యియ్యి" అన్నాడు బాధతో రామయ్య.

"ముందు రెండువందలు జతపెట్టు అదీ చూసేదాం" అన్నాడు నాయుడు.

ఆ రాత్రే రామయ్య రామునాయుడి ఇంటికి వెళ్ళి రెండువందలు ఇచ్చాడు.

మర్నాడు ఆఫీసుకెళ్ళి రామునాయుడు వచ్చాడు.

"పైసా ఎవడికీ ఇయ్యలేదు" అన్నాడు.

"పనైందా!" అన్నాడు ఆదుర్దాగా రామయ్య.

"పనౌతుందంటే యియ్యనూ? ఎందుకు నీ డబ్బు పాడుచెయ్యడం. ఇందా నీ డబ్బు" అని తిరిగి యిచ్చేశాడు డబ్బు. పనికాలేదు. జంక్షనులో బడ్డీ ఉండడానికి ఎంతమాత్రం అవకాశం లేదు.

"ఎల్లమ్మతల్లో! ఎల్లమ్మ తల్లో!" అని నెత్తిమీద చేతులు పెట్టుకుని ఏడుస్తూ రామయ్య కుంగిపోయాడు.

"ఏడిస్తే ఏం లాభంరా. ఉపాయం చూడాలి. నాకొక్కటి తట్టింది. చెపా విను....దద్దా."

"నేను దద్దని కాను. దద్దమ్మని. ఇంక నాకేం చేస్తావు నువ్వు."

"వినరా దద్దా"

"చెప్పు"

"జంక్షను దగ్గర ఇంక బ్రహ్మతరంకాదు. అక్కడ ట్రాఫిక్ రద్దీ ఎక్కువైంది. ఐతే ఒక్కటి చెయ్యొచ్చు. ఏమిటంటావా? జాగ్రత్తగా విను. ఇప్పుడు నీ బడ్డీ వుందా దాన్ని ఒక్క పదడుగులు గొందిలోకి జరిపి కాలువ మీద పెట్టుకుంటావా చెప్పు. ఒక్క పదంటే పదడుగులలోపుకి జరుపుకో. ఆర్డరు వేయించి యిస్తాను. గూడెం మధ్యలో ఉంటుంది. నీ బేరం ఎక్కడికి బోదు. ఆలోచించి చెప్పు" అన్నాడు రామునాయుడు.

"గనమైన ఆలోచన చెప్పినావు రామునాయుడూ! సెయ్యి. గూడెం బేరమెక్కడికిపోదు" అన్నాడు పోలిగాడు.

"ఓ సెయ్యి అది సాలు" అన్నాది సీతమ్మ.

"బాగుంది ఎల్లమ్మ దయతో అలా చేయించు. జరుపుకుంటాను. అది శాన" అన్నాడు రామయ్య.

"చెప్పేను కాని దానికీ దూతలున్నారు. ఖర్చు అవుతుంది" అని నసగి చెప్పాడు రామునాయుడు.

"ఇయ్యనే యిచ్చాను. రెండొందలు. అప్పు తేనే తెచ్చాను. రెండొందలూ పట్టికెళ్ళు" అన్నాడు రామయ్య.

రామునాయుడు డబ్బు మళ్ళీ పట్టుకెళ్ళాడు. మరో పిటీషను రాయించాడు. కాస్త పదడుగులు గొందిలోపుకి బడ్డీని జరిపి పెట్టుకోనివ్వమని అర్జీ విన్నపములు ఈ మాటు పట్టుకెళ్ళిన రెండువందలు యింటికి తిరిగి

రాతేదు. ఆర్డరు మూడోరోజుకి పడిపోవలసిందే. అంతా అయిపోయింది. మరి ఏ కారణంచేతో కమీషనరు సంతకం అయి కాయితం బైటకురాలేదు.

రామునాయుడు దిగాలు పడిపోయాడు. దబ్బూపోయి శనిపట్టుకుంది.

"కమీషనరు ఎందుకు సంతకం చెయ్యలేదు.?" అడిగేడు పోలిగాడు.

"కొద్దిరోజుల్లో ఆయన బదిలీ అయి వెళ్ళిపోతున్నాడు. రాబట్టుకోవాలని ఆశ ఉండదా?" అన్నాడు రామునాయుడు.

"సచ్చిపోనాము" అన్నాది సీతమ్మ.

"చేస్తానన్నాడు. కాయితం దగ్గర కొచ్చేసరికి నిలబెట్టేశాడు" అన్నాడు రామునాయుడు.

"ఏ పాటి ఇస్తే సరిపోతుంది?" అని ప్రశ్నించాడు పోలిగాడు.

"ఆమ్మో కమీషనరుగారికి మనం ఇచ్చుకోగలమా!" అన్నాడు నాయుడు.

"మరి రెండొంద లెవరికి ముట్టినాయి?" ప్రశ్నించాడు పోలిగాడు.

"క్రింది దూతలకిరా?"

"పెద్ద దూతకెంత?"

"ఐదొందలకి తక్కువైతే ముట్టడు? అమ్మో మనమిచ్చుకోలేము!" అన్నాడు నాయుడు-

"ఆడికొంప కగ్గి పెట్టెయ్యమను" అన్నాడు పోలిగాడు.

"అమ్మో ఎక్కడతేము?" అని ఏడ్చింది సీతమ్మ.

"ఇదంతా ఎందుకిలా గొచ్చిందీ?" అని నెత్తి మొత్తుకున్నాడు. రెండుచేతుల్తో రామయ్య.

"దద్దా ఇప్పుడు లోకమలాగుంది" అన్నాడు నాయుడు.

"ఐతే నన్నేటి సెయ్యమన్నావు?" అడిగేడు రామయ్య.

"ఈః కమీషనరు ఎలాగూ పోతున్నాడు. మరొకడొస్తాడు. అంత వరకూ ఉందాం!" అన్నాడు నాయుడు.

"క్రింది దూతల కిచ్చిన రెండొందలమాటా!" ప్రశ్నించాడు పోలిగాడు.

"తిరిగి నా కొడుకులు ఇస్తారా? అందుకే తటపటాయిస్తున్నాను. అవి గంగపాలు కాకుండా ఆర్డరేయించుకు రావాలి."

"మా మెక్కడి నుండి తేము ఐదొందలూ" అని మూలిగింది సీతమ్మ.

"రేపు మళ్ళా కమీషనరు గారితో చెప్పి చూస్తాను. ముప్పైఏళ్ళ బట్టి ఉన్నాడు. బడ్డీ పీకిస్తే వాళ్ళ పీక కోసుకుపోతుంది అని చెపుతాను మళ్ళీ" అన్నాడు నాయుడు.

"ఇనకపోతే?" ప్రశ్నించాడు పోలిగాడు.

"కొత్త కమీషనరు వొచ్చేదాకా ఉందాం" అన్నాడు నాయుడు.

"కోళ్ళుతినే వోడుపోయి గొఱ్ఱెలు తినే వోడువస్తే?" ప్రశ్నించాడు పోలిగాడు.

"మనదృష్టం ఎలాగుందో మరోసారి కమీషనరు గారితో చెప్పి చూస్తాను. తరువాత ఆలోచిద్దాము" అని రామునాయుడు వెళ్ళిపోయాడు.

చెప్పేశాడు పోలిగాడు· ఇదంతా రామునాయుడి నాటకమే. పచ్చి మోసము. పచ్చగా ఉన్నాదని పట్టుకున్నాడు. చిలుం వదల కొట్టదలుచు కొన్నాడు.

"రామయ్యా ఇక లాభంలేదు. ఎక్కడ ఏడుస్తావో ఏడువు. ఐదొం దలూ ఆడి మొఖాన్నపారీ. ఆ బడ్డీ నిలుపుకో" అని సలహా యిచ్చాడు పోలిగారు.

"ఇదంతా రామునాయుడి మోసమంటావా?" అని అడిగాడు రామయ్య

"తప్పకుండా."

"తొలి డబ్బు తీసికెళ్ళి తిరిగిచ్చేశాడు."

"మనకి నమ్మకం పుట్టొద్దా?"

"ఐదొందలూ తినేసి పని సెయ్యకపోతే."

"అది నిక్కచ్చిగా అడిగి నలుగుర్లో ఇద్దాం" అన్నాడు.

రామయ్య ఐదువందలూ రామునాయుడికి షరతుమీద ఇచ్చాడు. జంక్షనులో బడ్డీ పది అడుగులలోపుకి పెట్టుకోడానికి అర్డరు కాయితం కమీషనరుగారి దస్కత్తుతో వారు బదిలీమీద వెళ్లిపోకుండానే వచ్చేసింది. ఆ తరవాతే కమీషనరుగారు వెళ్ళిపోయారు.

రామయ్య యిచ్చిన ఏడు వందల రూపాయలు ఇంట్లో నగదు రూపంగా ఉన్నదబ్బే. ఐతే పదిమందికీ తెలియకుండా మెళ్లోనానూ,

పట్టెడా సీతమ్మ తీసేసి పెట్టెలో పడేసింది. బంగారం బంగారంలాగ కన పడుతూ ఐదువంద లిచ్చారంటే గూడెం గొల్లుమంటుంది.

రామయ్య జంతిలోకి బడ్డీ జరుపుకున్నాడు. దానికి పాతిక రూపాయి లయింది. ఎల్లమ్మకి మొక్కుకున్నందుకు, నమ్ముకున్నందుకు గుడ్డిలో మెల్ల ఏడువందలకి గాలివచ్చినా గూడెంలో బడ్డీ గూడెంలోనే ఉంది. రామయ్య ఎల్లమ్మకి వేటవేసి రామునాయుడికి ఇచ్చేశాడు. మళ్ళా బుర్రొంచుకుని కూనిరాగాలు తీస్తూ బడ్డీస్థలంలో మార్పువచ్చినా అదే బడ్డీ మీద కూర్చొని చుట్టలు చుట్టుకుంటూ అమ్ముకుంటున్నాడు. ఒక్క ఖాతా పోలేదు. బేరం పిసరు తగ్గలేదు.

పోలిగాడికి మాత్రం రామునాయుడు మీద కసిపోలేదు. చాలా ఆరాలు తీశాడు.

"ఇదంతా ఈఁడినాటకమేరా. ఏడొందల్లో పద్దైనా గుమస్తాలకిచ్చాడో లేదో, ఈఁడే కాజేశాడు. ఎళ్ళిపోయిన కమీషనరుగారు దేముడురా. కానీ లంచం పుచ్చుకోలేదని వూరంతా కోడై కూస్తున్నాది. ఊళ్ళో పెద్ద ఆయన్ని బదిలీ చేయొద్దని కాయితాలు పెట్టినారుట?" అన్నాడు పోలిగాడు.

"పోన్నేరా....పోయిం డబ్బురాదు. ఆడిపాపాన్ని ఆడేపోతాడు. ఎల్లమ్మ చూస్తున్నాది కదా?" అన్నాడు రామయ్య.

"ఎవ్వరికీ ఏ పాపం చేసిన వోళ్లం కాదు. భగమంతుడిమీద బార మేసి బతుకుతున్నాము. మీదివోడి దయవుంటే మిద్దెయిల్లుమేడౌతాది" అన్నాది సీతమ్మ.

"ఆడికి ముందేటి జరిగినా ముందు మనకి ఏడొందలొదిలినాయి. మళ్లీ వోట్లెలక్షన్లు రావా అప్పుడి నాకొడుక్కి గూడెమంతా ఎదురు తిరిగి కాజా ఇవ్వాలి." అన్నాడు పోలిగాడు.

వార్డులో రెండు విధాలుగా చెప్పుకుంటున్నారు. లంచంపుచ్చుకున్నా రామునాయుడితో చెప్పిన పని అవుతుంది అనే మాటే పైకివచ్చింది. వార్డులో చాలా మంది గృహస్థులకి మునిసిపాలిటీతో అదివరకు లేని తగా దాలు తలెత్తడం రామునాయుడు మధ్య పడడం నాలుగు డబ్బులు పుచ్చు కోడం నిజమే. కొత్తగా కొంపలు కట్టుకున్నా, పాకేసినా ఇల్లుమరమ్మత్తు

చేసినా, ఇంతా అంతా అని పుచ్చుకోడం ఎవరికీ ఏ ఇబ్బంది లేకుండా చూస్తూ ఉండడం ఉంది.

ఐతే ఏమంటాడూ అంటే వాడికి జీతవాఁ బత్తెవాఁ ఆపాటి చూసు కోకపోతే అడి దినమెలాగ వెళుతుంది అంటారు. ఊరికే ఎవరూ ఇవ్వరు కదా? ఉపకారం చేస్తే కాస్త పుచ్చుకోడం తప్పేముంది? అని అంటారు.

రామయ్య బడ్డీ పూర్తిగా పీకించిస్తేవాడి బతుకేంగానూ అనే ప్రశ్న వస్తున్నది. ఉపకారం చేసినా చేశాడనరు కొందరు. తినేశాడు అంటారు. ఎంత తాను తిన్నాడు. దూతల కెంత ఇచ్చాడు. అనేది ఆరా తియ్యరు.

ఐతే రామునాయుడు కౌన్సిలరు అయిన దగ్గర నుండి ఘనంగా బతుకుతున్నాడు. జోరుగా ఖర్చు పెడుతున్నాడు. ఉపకారస్తుడంటున్నారు. అపకారస్తుడంటున్నారు.

ఇది ఉపకారమా అపకారమా ? కొత్త కమీషనరు గారు వచ్చిన కొద్ది రోజులకి రామునాయుడు పనికట్టుకుని రామయ్య యింటికి వచ్చాడు.

దద్దా కొత్త కమీషనరు గారు వచ్చారు. నువ్వు కాయితం పెడితే నీ బడ్డీని మామ్మూలు చోటికి జంక్షనుకి మార్చివొచ్చు పెడతావా?" అని అడిగాడు.

"మళ్లీ మార్పా. ఒక తూరి మార్చినందుకు పాతిక రూపాయిలైనాయి."

"ఏమో చూసుకో, ఇప్పుడు మార్చుకోవొచ్చు. జంక్షను : ఆలోచించుకో, కాని ఒక్కటుంది. నీకు రెండువందలు ఖర్చు అవుతుంది." అని కూడా నాయుడు చెప్పాడు.

"అమ్మో ! ఇప్పటికే అప్పులపాలయినాను" అన్నాడు రామయ్య.

"నీ యిష్టం దద్దా. నీకు చెప్పాలి కదా? చెప్పేను. ఆలోచించుకో. వారం నాడు చెప్పు" అన్నాడు. సీతమ్మ వొప్పుకోలేదు. పోలిగాడు జంక్షనుకి వెళ్ళడం మంచిదన్నాడు. రెండువందలు లంచం అనేసరికి వొద్దులా అనేశాడు.

శనివారం రాంమందిరంలో అంతా భజనకి సిద్దంగా ఉండగా రామునాయుడొచ్చి "దద్దా ఆలోచించావా?" అని అడిగాడు.

మళ్లా ఎందుకు ? ఇప్పుడు నాకేంలోటు లేదు" అన్నాడు రామయ్య.

"జంక్షనులో బడ్డీ. చిరకాలం నుంచి ఉన్నావు. అవకాశంగా ఉంది. నీయిష్టమొచ్చినట్టేచెయ్యి." అన్నాడు నాయుడు. పదిమందిలో చెప్పేడు.

"వొద్దునాయుడు. నేను మరి కదల్లేను. ఏదో ఇలాగ మీమధ్య బతక నీయండి చాలు" అన్నాడు రామయ్య.

వారం తిరక్కుండా జంక్షనులో కాలువ మలుపు మీద పది అడుగుల పొడుగున బ్రహ్మాండమైన బడ్డీ తెచ్చి అమర్చేశారు. ఎత్తుకాళ్ల మీద ఎనిమిదడుగుల ఎత్తునలేచింది. పక్కనుంచి తలుపులు వెనక్కి కిటికీలు ఉన్నాయి. అందమయిన పెయింటువేసి పెద్ద పట్నాల పద్ధతిలో బడ్డీ తయారయింది. పెద్దసిగరెట్టు పెట్టెలు, బీడీలకట్టలు, సోడాబుడ్లు, కలర్లు, రంగురంగుల గాజుజాడీలు ఒకటేమిటి అన్ని సామానులు అందంగా అమర్చి ముందుకి పొడుగ్గా ట్యూబులైటు బిగించారు.

బడ్డీ రామునాయుడి మేనల్లుడి పేర నమోదైంది. సరిగ్గా రామయ్య పూర్వం బడ్డీ ఉన్న చోట్లోనే పెట్టారు.

రామయ్య పని అయిపోయింది. వాడి బడ్డీ గొందిలో నాలుగడుగుల ఎత్తున వికృత రూపాన్ని పొందింది.

సాయంకాలం చీకటయిందంటే రామునాయుడి బడ్డీ ట్యూబులైటుతో గూడెం జంతి, మూడుతోడ్ల జంక్షను పట్టపగలై పోతున్నాది. అక్కడ బెంచీలు కుర్చీలు వేసేసి రామునాయుడు కూర్చుంటాడు. ఎంతోమంది వచ్చి కూర్చుని టప్పాలు కొడుతుంటారు.

రామునాయుడి కిళ్ళీ బడ్డీకి జనం వచ్చిపోతూ ఉండడం వెంటనే ప్రారంభమైంది. ఆ బడ్డీలో నాటుసారా అమ్మకం ఉంది. ప్రజలకి తాగుడు కావాలి. విరగబడి వస్తున్నారు. అక్కడ ధైర్యంగా తాగొచ్చు. బోరవిరుచు కెళ్ళవచ్చు. అది రామునాయుడి దుకాణం. అక్కడే భయం లేదు.

రామునాయుడి బడ్డీతో గూడెంకి ఎక్కడలేని కళా వొచ్చింది.

పట్నానికి ఏడుమైళ్ళ దూరంలో పాలెం ఉంది. రోడ్డు వార గ్రామం రామయ్య బడ్డీ ఎత్తేశాడు. పాలెం రోడ్డువార దాన్ని నిలబెట్టాడు. అది వాడి అత్తవారి గ్రామం. ఇదివరకు సంపాదించిన డబ్బుతో చిన్న మడిచెక్క

అక్కడ కొనుక్కున్నాడు. అక్కడికి వలసపోయాడు. అక్కడ బడ్డీ నిలబెట్టి ఎల్లమ్మకి కోడిపిల్లని మొక్కు చెల్లించాడు. ఎల్లమ్మ పట్నం నుంచి కదిపి పాలెంకి ఎందుకు పంపిందో ఆ తల్లిమీద భారంవేసే రామయ్య అక్కడికి పోయాడు. ఎల్లమ్మ రామయ్య ఇలవేలుపు.

రెండు విధాల అంటున్నారు. రామునాయుడు మొదటినుంచీ ప్లేను వేసి రామయ్యని జంక్షను నుంచి గెంటేశాడని కొందరు. అదేంకాదు; రామయ్యదే పొరపాటు. తెలివితక్కువ ముండాకొడుకు జంక్షనులో తిరిగి ఇప్పిస్తాను వెళ్ల దద్దా అంటే వెళ్లాడా అంటారు కొందరు. రెండు విధాలా అంటున్నారు.

రామయ్య ఇంట్లో ఎవరికీ ఈమధ్య ఎల్లమ్మ పూనడంలేదు.పూనడం ఉంటేనా? ఎల్లమ్మ నిజం చెప్పేసేది.